ఊరితో అనుబంధం...

# బడితో వీడని బంధం



## ఆర్.ఎల్.ఎఫ్. ఆధ్వర్యంలో 22 బాల గ్రంథాలయాలు

## రేపు అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం

**సిరిసిల్ల, న్యూస్‌టుడే**

గోరుముద్దలు తినిపిస్తూ అమ్మ.. ఒళ్లో కూర్చుం డబెట్టుకొని తాతయ్యలు, అమ్మమ్మ, నానమ్మలు చిన్నారులకు ఎన్నెన్నో కథలు చెప్పేవారు. వారి కళ్ల ముందు అద్భుత ప్రపంచాన్ని ఆవిష్కరించే వారు. బాలలు ఎదుగుతున్న క్రమంలో జానపద కథలు.. గాథలు పుస్తకాలుగా ముందుకు వచ్చేవి. మౌఖికంగా విన్న కథలన్నీ అందమైన చిత్రాలతో సాక్షాత్కరించేవి. చందమామ, బొమ్మరిల్లు లాంటి పత్రికల్లో కథల్ని చదవడం ఒక గొప్ప అనుభూతి. ఇప్పటి పెద్దలందరికీ అవి తీపి జ్ఞాపకాలు. ఈనాటి చిన్నారులకు మాత్రం అవి దూరమవుతున్నాయి. చదువుల్లో పోటీతో బాలలు తరగతి పుస్తకాలకే పరిమితమవుతున్నారు. ఇతర సాహిత్యాలు, పుస్తకాలకు వారు చేరువ కావడం లేదు. పఠనాసక్తి తగ్గిపో తుంది. సృజనాత్మకత, సామాజిక స్పృహ లోపి స్తుంది. పట్టణ ప్రాంతాల్లోని బాలలకు కామిక్స్, ఇతర వినోద, విజ్ఞాన గ్రంథాలు అందుబాటులో ఉన్నప్పటికీ మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు సాహిత్యం, విజ్ఞానం అందించే పుస్తకాలు వారికి అందనంత దూరంలో ఉంటాయి. 'సర్కార్' బడులలో విద్యా భ్యాసం చేసి ఉన్నత చదువులు చదివి అమెరికా తదితర ప్రాంతాల్లో ఉద్యోగాల్లో స్థిరపడినవారు గ్రామీణ బాలల్లో పఠనాసక్తిని పెంపొందించడం, సాహిత్యం పట్ల అభిరుచిని కలిగించాలన్న లక్ష్యంతో గత దశాబ్దకాలంగా కృషి చేస్తున్నారు. తాము పుట్టిపెరిగిన గ్రామంతో ఉన్న అనుబంధంతో అక్కడి పాఠశాలలో బాలల కోసం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి ప్రతిఏటా నిర్వహణకు అయ్యే ఖర్చులు భరిస్తున్నారు. ఒక్కో పాఠశాలకు ఒకరు బాధ్యతలు స్వీకరించారు. ఇందుకోసం 'రూరల్ లైబ్రరీ ఫౌండేషన్(ఆర్.ఎల్.ఎఫ్.) స్థాపించారు. కరీంనగర్, వరంగల్, జిల్లాలోని 22ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గ్రంథాలయాల్ని నెలకొల్పారు. ఇందులో 10గ్రంథాలయాలు జిల్లాలోని పాఠశాలల్లో ఉన్నాయి. సోమవారం 'అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం' సందర్భంగా ఆర్.ఎల్.ఎఫ్. చేస్తున్న కృషి గురించి ప్రత్యేక కథనం...

### గ్రామీణ బాలల భవితకు బాటలు

పదేళ్ల కిందట రూరల్ లైబ్రరీ ఫౌండేషన్‌కు బీజావాసం పడింది. ఆర్.ఎల్.ఎఫ్. సమన్వయకర్తగా సాఫ్ట్‌వేర్ ఇంజినీయర్ గోనె ప్రతాప్, నిర్వాహక కమిటీ సభ్యులుగా, సలహాదారులుగా ప్రొఫెసర్ ఇ.రేవతి, టి.బుచ్చిబాబు, డి.స్వామిరావు, లక్ష్మణ్‌లు, అమెరికాలో స్థిరపడిన కోదాటి సుధీర్, తుమ్మల ప్రసన్న, మణికొండ అశోక్, నిశికాంత్‌రెడ్డిలు వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాన్ని నెలకొల్పడానికి ముందుకు వచ్చేవారికి అవసరమైన సలహాలను, సూచనలను అందించడంతో పాటు నిర్వహణను ఆర్.ఎల్.ఎఫ్. పర్య వేక్షిస్తోంది. జిల్లాలో బోయినిపల్లి జిల్లా పరిషత్తు పాఠశాలలో 2003 నుంచి ఆర్.ఎల్.ఎఫ్. గ్రంథాలయం కొనసాగుతుంది. అమెరికాలో స్థిరపడిన అదే గ్రామానికి చెందిన పాల్తెపు శ్రీనివాస్ దీనికి ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇప్పటివరకు రూ.46వేల వరకు ఇందుకోసం ఆయన వెచ్చించారు. అదే మండలంలోని కోరెం పాఠశాలలోని గ్రంథాలయానికి ఆ పాఠశాలలో చదివి అమెరికాలో ఉద్యోగం చేస్తున్న గడ్డం శ్రీనివాసరెడ్డి సహకరిస్తున్నారు. ఆయన ఇప్పటిదాకా రూ.43వేలు నిర్వహణ కోసం అందించారు. వీరితోపాటు హుజూరాబాద్ మండలం చెల్పూర్ జడ్పీఎస్ఎస్ పాఠశాలకు కాలువ రాజిరెడ్డి, ధర్మారం మండలం కట్కెనపల్లి పాఠశాల గ్రంథాలయానికి ఇ.వివేక్‌రెడ్డి, వీనవంక మండలం కోర్కల్ పాఠశాల గ్రంథాలయానికి కర్ర హరీంరెడ్డి, శ్రీరాంపూర్ మండలం మల్యాల పాఠశాల గ్రంథాలయానికి స్వచందర్‌రెడ్డి, కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం గ్రంథాలయానికి మాదాడి మహేశ్‌రెడ్డి, ఎల్కతుర్తి మండలం వల్భాపూర్ గ్రంథాలయానికి ఎ.గోపాల్‌లు నిర్వహణ వ్యయాన్ని అందిస్తున్నారు. ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ పాఠశాల గ్రంథాలయానికి బెంగుళూరులో స్థిరపడిన బోయినపల్లి రాజేశ్వర్, వీనవంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి హన్మకొండలో ఉన్న చైతన్యరెడ్డిలు చేయూతనందిస్తున్నారు. ఆయా గ్రామాలతో, పాఠశాలతో అనుబంధమున్న వీరు గ్రంథాలయ నిర్వహణకు సహకారం అందిస్తున్నారు.

### గ్రంథాలయాల్లో పత్రికలు

ఆర్.ఎల్.ఎఫ్. నేతృత్వంలోని పాఠశాల గ్రంథాలయాల్లో చందమామ(ఇంగ్లిష్, తెలుగు), బాలభారతి, బాలమిత్ర, బుజ్జాయి, చెకుముకి, చంపక్(ఇంగ్లిష్, హిందీ, తెలుగు), క్లాస్‌మేట్, డిస్కవరీ, ఇండియాటుడే, పాఠశాల, స్టడీమేట్, స్వాతి, ఉద్యోగ సోపానం, విజేత కాంపిటేషన్, విస్‌డమ్, వండర్ వరల్డ్ లాంటి పత్రికలు అందుబాటులో ఉంటాయి. పాఠశాల ప్రారంభానికి, పాఠశాల సమయం అనంతరం గంట వరకు ఈ గ్రంథాలయాలను తెరిచి ఉంచేలా ఏర్పాట్లు చేశారు. గ్రంథాలయాల్లో పత్రికల కోసం ప్రతినెల దాదాపు రూ.వెయ్యి వరకు వెచ్చిస్తున్నారు. ప్రవాసాంధ్రులు గ్రంథాలయ నిర్వహణకు ఆర్థికసాయం, పాఠశాలలకు ఫర్నీచర్ సమకూర్చడం, నోటు పుస్తకాల పంపిణీ,నిరుపేద విద్యార్థుల చదువులకు ఆర్థికంగా సహకరించడం లాంటి కార్యక్రమాల్ని ఆర్.ఎల్.ఎఫ్. ద్వారా నిర్వహిస్తున్నారు. మారుమూల గ్రామాల్లోని పాఠశాలలో అనేక పత్రికలు అందుబాటులో ఉండటం వల్ల విద్యార్థుల్లో పఠనాసక్తిగా పెరుగుతుంది.



### చిన్నారుల్లో పఠనాసక్తిని పెంచడమే లక్ష్యం

**- గోనె ప్రతాప్, సమన్వయకర్త, ఆర్.ఎల్.ఎఫ్**

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన తమలాంటి వారికి చిన్నతనంలో చందమామ లాంటి పత్రికలు అందుబాటులో ఉండేవికావు. చదవాలన్న ఆసక్తి ఉన్నా పుస్తకాలు దొరికేవికావు. ఎంతో కష్టపడి వాటిని సంపాదించుకొని చదివేవాళ్లం. అలాంటి పరిస్థితి ఈనాటి గ్రామీణ బాలలకు రాకూడదనే లక్ష్యంతో రూరల్ లైబ్రరీ ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఆ గ్రామంతో అనుబంధం కలిగి వివిధ ప్రాంతాల్లో, దేశాల్లో స్థిరపడినవారి ద్వారా పిల్లల కోసం గ్రంథాలయాల్ని ఏర్పాటు చేయిస్తున్నాం. ప్రధానంగా పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందించడమే లక్ష్యం. వీటితోపాటు మరికొన్ని కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నాం.